క్లుప్తంగా

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



కొబ్బరికాయలు సమర్పిస్తున్న ఆలయ అధికారులు, ఉద్యోగి

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం, శుక్రవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం భ్రమరాంబాదేవికి కొబ్బరికాయలు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి, పసుపు,కుంకుమలతో పూజాదికాలు జరిపారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించారు. ఏప్రిల్ 11న జరిగే కుంభోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి సాత్విక బలిగా కొబ్బరికాయలు సమర్పిస్తారు. అలాగే కుంభోత్సవం రోజు స్త్రీ వేషధారణలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ హరిదాసు, పర్యవేక్షకులు స్వాములు, ఆలయ ఉద్యోగి నాయక్ ల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



దెబ్బతిన్న మిరప పంటను పరిశీలిస్తున్న దృశ్యం

మిడుతూరు: అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని జలకనూరు, చింతలపల్లి, ఖాజీపేట, దేవనూరు, తదితర గ్రామాల్లో వడగండ్ల వాన బీభత్సానికి నష్టపోయిన మిరప, అరటి, బొప్పాయి, మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. పంట చేతికి అందే సమయంలో కురిసిన అకాల వర్షానికి 30 శాతం పంట కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి రాజశేఖర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు రామకృష్ణ, మద్దిలేటి, రమణయ్య, శ్రీనివాసులు, శేఖర్, వెంకటరరమణ, రవి, నాగరాజు, రవి పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక సమావేశం

మహానంది: స్థానిక శాలివాహన అన్నసత్ర భవనంలో ఈ నెల 26వ తేదీ ఆదివారం వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సమావేశానికి అందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు.

రేపు వసతి గృహ నిర్మాణాలకు భూమి పూజ

మహానంది: టీటీడీ నిధులు రూ.4.60కోట్లతో మహానంది దేవస్థానంలో నూతనంగా నిర్మించనున్న 30 వసతి గృహాల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, ఇతర ఉన్నతాధికారులు హాజరు కానున్నట్లు చెప్పారు.

మేలైన విత్తనాలతో అధిక దిగుబడులు

పగిడ్యాల: రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని లక్ష్మాపురం గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు వసంత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పడమర ప్రాతకోటలో జీఎం 444 రకం మొక్కజొన్న పంట క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఎం.ఎస్. ఘణపురం, రైతుపల్లె, లక్ష్మాపురం తదితర గ్రామాల నుంచి రైతులు పాల్గొని మొక్కజొన్న కంకులను పరిశీలించారు. కో ఆప్షన్ సభ్యుడు అస్లాంబాషా, సొసైటీ డైరెక్టర్ దివాన్‌సాహెబ్, ఉప సర్పంచ్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

పాములపాడు: మండలంలోని వాడాల గ్రామంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా నెలకొన్నాయి. చాలా ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినవి కావడంతో శిథిలమయ్యాయి. సిమెంట్ పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తూ ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. గ్రామంలో పలు స్తంభాలు ఇలా ఉన్నాయని, ఏదైనా గాలి వాన వస్తే ప్రమాదం చోటుచేసుకునే అవకాశముందని, వెంటనే మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తుల ఇలవేల్పు..రంగనాథుడు

- ఈనెల 29 నుంచి తర్తూరు రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు
- ఏప్రిల్ 5న రథోత్సవం
- తరలిరానున్న భక్తజనం
- 7న ఉత్సవాల ముగింపు



ఆలయంలో కొలువుదీరిన శ్రీరంగనాథస్వామి మూల విరాట్



శ్రీ లక్ష్మీదేవి అమ్మవారి మూలమూర్తి



నిజస్వరూపంలో (చెక్కరూపం లో) స్వామివారి విగ్రహం

జూపాడుబంగ్లా: మనఃపూర్వకంగా కొలిచే వారి కొంగుబంగారమై.. వారి ఇలవేల్పుగా విరాజిల్లుడుతున్నాడు.. శ్రీ లక్ష్మీరంగనాథ స్వామి. మండలంలోని తర్తూరు గ్రామంలో వెలసిన రంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు.

ఆలయచరిత్ర..

సుమారు 724 ఏళ్ల క్రితం తర్తూరు గ్రామంలోని ఉల్పా వంశానికి చెందిన రాజారెడ్డి కి మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు మండలం, శ్రీరంగాపురం గ్రా మానికి చెందిన రంగమ్మ అనే మహిళతో వివాహం జరిపించారు. ఏటా హోలీ పున్నమినాడు శ్రీరంగాపురంలో జరిగే శ్రీలక్ష్మీరంగనాథస్వామి వారి ఉత్సవాలకు వారు వెళ్లేవారు. వేడుకల అనంతరం ఆనవాయితీ ప్రకారం పుట్టింటివారు రంగమ్మకు ఒడిబియ్యం పెట్టి పండంటి బిడ్డపుట్టాలని బియ్యంలో ఆడ రూపంలో ఉన్న ఓ చెక్కబొమ్మను పెట్టేవారు. తర్తూరుకు వచ్చిన అనంతరం ఆ దంపతులు ఒడిబియ్యాన్ని విప్పిచూడగా అందులో ఆడరూపంలో ఉన్న బొమ్మ మగరూపంలోకి మారేది. దీంతో మెట్టింటివారు కోడలిని మందలించేవారు. అలాగే ఏటా వారి వంశస్తులు ఎవరోఒకరు మరణించడంతో పాటు అనారోగ్యాలకు గురయ్యేవారు. ఇలా మూడు, నాలుగు పర్యాయాలు జరగటంతో కోపంతో వారు చెక్కబొమ్మను పశువుల గాడిలోకి విసిరివేయటంతో స్వామివారు పూనకం వచ్చి తాను శ్రీరంగనాథస్వామి వారినని పేర్కొన్నాడు. తాను తర్తూరులోనే కొలువుంటానని తనకు ఏటా జాతర నిర్వహించి భక్తిశ్రద్ధలతో కొలిస్తే అష్టైశ్వర్యాలు ప్రసాదించటంతో పాటు వారికి పాడి పంటలు వృద్ధి చెంది, వంశాభివృద్ధి జరుగుతుందని ఆశీర్వదించాడు. అప్పటినుంచి ఉల్పా వంశస్తులు స్వామివారు కొలువుదీరిన ఇంటితో పాటు 60 ఎకరాల పొలాన్ని స్వామి వారికి దారాధత్తం చేసి ఏటా ఉత్సవాలు నిర్వహించడం ప్రారంభించారు. ఇలా ఉమ్మడి రాష్ట్రంలోనే ఉత్సవా లు ప్రత్యేకతను సంతరించుకొని పేరుగాంచాయి.

జాతర ప్రత్యేకత..

తర్తూరు జాతర అనగానే కలప, ఎద్దుల విక్రయాలు గుర్తుకొస్తాయి. ఈ జాతరలో కడుపేదవాడి నుంచి ధనికుడి వరకు అవసరమైన వంటింటి, వ్యవసాయ పనిముట్లు లభిస్తాయి. అయితే పదేళ్ల నుంచి అటవీశాక అధికారులు కలప ఉత్పత్తులను అమ్మడం నిషేధించారు. దీంతో కలప ఉత్పత్తుల విక్రయాలు నిలిచిపోయాయి. వాటిస్థానంలో ఇనుముతో తయారుచేసిన వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి వచ్చాయి. అనుమతి ఉన్న కలపడిపో వారు మాత్రమే చెక్కతో తయారు చేసిన పరికరాలు తెచ్చి విక్రయిస్తుంటారు. ఇక మాంసాహార ప్రియులకు ఇక్కడి కడ్డీలు నోరూరిస్తాయి. ఈ మాసంపు కడ్డీలను తినటానికి కొందరు ప్రత్యేకంగా వస్తారంటే అతిశయోక్తి కాదు.

ఉత్సవాలు ఇలా..

ఈనెల 29 నుంచి ప్రారంభమయ్యే తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 5న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ, కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి తెలిపారు. 29న పూలచపురం, 30న సింహవాహన సేవ, 31 హంస సేవ, ఏప్రిల్ 1న శేష వాహనసేవ, 2న హనుమంత సేవ, 3న గరుడసేవ, 4న గజవాహనసేవ, ఏప్రిల్ 5న రథోత్సవం, 6న పారువేట, 7న తీర్థావళితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

వైభవం.. శ్రీవారి కల్యాణం

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ సమేత వేణుగోపాల స్వామి, శ్రీపార్వతి సమేత మల్లేశ్వరస్వామి వార్ల కళ్యాణ మహోత్సవ కార్యక్రమం గురువారం అర్ధరాత్రి 12 గంటలకు వైభవంగా ఆలయ పురోహితులు సుబ్రహ్మణ్య, శర్మ గ్రామపెద్దలు, భక్తుల సమక్షంలో నిర్వహించారు. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించిన అనంతరం కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా జరిపించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు తరలి వచ్చారు. కల్యాణం అనంతరం రాత్రి శ్రీలక్ష్మీ సమేత వేణుగోపాల స్వామి, శ్రీపార్వతి సమేత మల్లేశ్వరస్వామి వార్ల ప్రభోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను నూతన వస్త్రాలతో అలంకరించి ముస్తాబు చేసిన ప్రభపై అదిష్టింపజేసి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



పల్లకీలో ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

మహానంది: శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లు శుక్రవారం రాత్రి పల్లకీలో కొలువై విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్య, హరికుమారశర్మ స్వామివార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి అలంకార మండపంలో శాస్త్రోక్త పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీకి ముందు గోమాతను ఉంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

వేలంలో తగ్గిన ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న చైర్మన్, సర్పంచ్

జూపాడుబంగ్లా: ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభమయ్యే తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథ స్వామి వారి జాతరలో టెంకాయలు విక్రయించేందుకు శుక్రవారం ఆలయం కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, సర్పంచ్ పీఎం నాగిరెడ్డి అధ్వర్యంలో వేలం నిర్వహించారు. రూ.5వేల ధారావత్తు చెల్లించి 10 మంది పాల్గొన్నారు. వారిలో కొణిదేలకు చెందిన బాలన్న అనే వ్యక్తి అత్యధికంగా రూ.3,41,000కు వేలం దక్కించుకున్నారు. మీడియం సైజులో ఉండే టెంకాయలను ఈనెల 29నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు మాత్రమే విక్రయించాలని ఒప్పందంలో పేర్కొన్నారు. కాగా గతేడాది కంటే రూ.1,09,000 ఆదాయం తగ్గింది.

రూ.91,000కు లడ్డూ వేలం..

జాతర సందర్భంగా ఆలయం వద్ద స్వామివారి లడ్డూ ప్రసాదాల విక్రయానికి వేలం పాటలు నిర్వహించగా రూ.5వేల దారావత్తు చెల్లించి 11మంది పాల్గొన్నారు.కొణిదేలకు చెందిన బాలన్న రూ.91,000 దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది లడ్డూ వేలం పాటల ద్వారా రూ.46వేల ఆదాయం పెరిగింది. 75 గ్రాముల బరువున్న లడ్డూ ఒకటికి రూ.15ల చొప్పున ఈనెల 29 నుంచి ఏప్రిల్ 12వరకు విక్రయించుకోవాలని ఆదేశించారు. అలాగే భక్తులు సమర్పించే టెంకాయల్లోని కొబ్బరి చిప్పలను పోగు చేసుకొనేందుకు వేలం నిర్వహించగా బాలన్న రూ.41,000వేలకు దక్కించుకొన్నారు. గతేడాది కంటే రూ.4వేల ఆదాయం తగ్గింది. వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, నానిరెడ్డి, కోసిక తిరుమలేశ్వరరెడ్డి, నరేష్‌రెడ్డి, లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, నాగేశ్వరరెడ్డి, సుంకిరెడ్డి, నరసింహయాదవ్, శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బండిఆత్మకూరు: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులు చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎస్‌ఓ అనురాధ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 6వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సంలో ప్రవేశాలకు, 7,8,9వ తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్ లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. మీసేవ కేంద్రాల వద్ద ఆన్‌లైన్‌లో దరఖాస్తు లు చేసుకోవాలన్నారు.ఇందుకు విద్యార్థిని ఆ ధార్, స్టడీ, తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డు, విద్యార్థి ఫొటోతప్పనిసరిగా ఉండాలని చెప్పారు.

ఉపకారవేతనానికి ఎంపిక



అపరంజిత

మహానంది: గోపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదోవతరగతి చదువుతున్న వి.అపరంజిత నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ శుక్రవారం తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో ప్రతిభ చూపిన అపరంజితను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో 11 మంది విద్యార్థులు, తిమ్మాపురం జెడ్పీ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు ఉపకార వేతనాలకుకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఆసరాతో జీవనోపాధి మెరుగుపరుచుకోవాలి

జూపాడుబంగ్లా: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకొని జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని సర్పంచ్ నాగార్జునరెడ్డి, ఏపీఎం అంబమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని పి.లింగాపురం గ్రామంలో వైఎస్సార్ ఆసరాపై పొదుపు మహిళలకు అవగాహన కల్పించారు. ఏపీఎం అంబమ్మ, వెలుగు సీసీ గాంధీ మాట్లాడుతూ నేడు మూడోవిడత వైఎస్సార్ ఆసరా మొత్తాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైకేపీ సీసీ దేవ్‌పాల్, అకౌంటెంట్ రమేష్, వీఓఏ, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

గోసంరక్షణ నిధి పథకానికి విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయ పర్యవేక్షకురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గోసంరక్షణ నిధి పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన డి.మోహన్‌రావు రూ.లక్ష విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా దాతకు దేవస్థానం తరఫున పర్యవేక్షకురాలు హిమబిందు స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

క్రమశిక్షణ కలిగి ఉండాలి



అర్చక ఆగమ పునశ్చరణ తరగతుల ప్రారంభంలో పాల్గొన్న ప్రతినిధులు

శ్రీశైలంటెంపుల్: వీరశైవ సంప్రదాయంలో క్రమశిక్షణ, మృధ స్వభావం, నిబద్ధత కలిగి ఉండాలని శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యుడు మఠం విరూపాక్షయ్యస్వామి తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని అర్చక ట్రెనింగ్ అకాడమీ, శ్రీశైల దేవస్థానం సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న అర్చక ఆగమ పునశ్చరణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రారంభమైన కార్యక్రమంలో ట్రెనింగ్ అకాడమీ చీఫ్ ట్రెనింగ్ డా.వి.ఎం.చక్రవర్తి, డైరెక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి, దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి పాల్గొన్నారు. స్వామివార్ల ఆలయ ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, శివప్రసాద్ స్వామి, జిల్లా సంగమ అర్చక సంఘం అధ్యక్షులు జె.లాల్‌బహుదూర్ శాస్త్రి, ఎం.పి అర్చక సమాఖ్య అధికార ప్రతినిధి జె.బస్వరాజ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తి రంజని

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై శుక్రవారం పాలమూరు జిల్లాకు చెందిన మహంకాళీ దేవస్థాన భజన మండలి వారి భక్తి రంజని కార్యక్రమం అలరించింది. కార్యక్రమంలో వాతాపీ గణపతిం, శివ శివ శంకర, నమశ్శివాయ, శంభోశంకర తదితర గీతాలకు చంద్రశేఖరాచారి, అర్జున్‌గౌడ్, లక్ష్మయ్యగౌడ్, వెంకట్రామిరెడ్డి, దామోదర్‌రెడ్డి, ఉపేందర్ ఆలపించారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రమణ

మహానంది: పనులు చేసి ముగించుకుని ఇంటికి వస్తుండగా ఓ వాహనం ఢీకొని బొల్లవరం గ్రామానికి చెందిన నేసం రమణ తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. నంద్యాల సమీపంలోని సుగాలిమెట్ట వద్ద ఓ గోడౌన్‌లో నేసం రమణ హమాలీ పనులు చేస్తున్నాడు. పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా ఓ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అలాగే.. తమ్మడపల్లె మలుపు వద్ద ఉదయం చోటుచేసుకున రోడ్డు ఘటనలో మహానందికి వస్తున్న ఓ ఆటో, నంద్యాల వైపు వెళ్తున్న బైక్ ఢీకొనడంతో నంద్యాలకు చెందిన మద్దయ్య, వేణుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా: రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. మండ్లెం గ్రామానికి చెందిన బోయ మౌలాలి(35) ఈనెల 22న నందికొట్కూరుకు వెళ్లి ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళ్తుండగా కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బొలేరో డ్రైవర్ పెద్దపుల్లయ్య అతివేగంగా నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి మౌలాలి బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన బాధితున్ని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య కర్నూలు ఆసుపత్రికి వెళ్లి మృతుని భార్య బోయ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహింపజేసి బంధువులకు అప్పగించారు.

అనుమానాస్పద స్థితిలో బర్రెలు మృతి





రేకుల షెడ్డులో మృతి చెందిన పశువులు, గాయపడిన పశువులకు సపర్యలు చేస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: లింగాపురం గ్రామంలో శుక్రవా రం తెల్లవారు జామున అనుమానాస్పద స్థితిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎనిమిది బర్రెలు మృతి చెందాయి. మరో ఆరు బర్రెలు కాలిన గాయాలతో బయటపడ్డాయి. గ్రామానికి చెందిన భూమా ప్రతాప్‌రెడ్డి తనకున్న రెండెకరాల భూమితో పాటు పాడి తో జీవనం సాగిస్తున్నారు. అయితే గ్రామానికి కొద్దిదూరంలో రేకుల షెడ్డుతో పశువుల పాక ఏర్పాటు చేసుకున్నారు. కాగా గురువారం రాత్రి 10 గంటల సమయంలో పశువులకు మేత వేసి, నీళ్లు తాపించి ఇంటికి వచ్చారు. తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో అటువైపు వెళ్లిన గ్రామస్తులకు పాకకు నిప్పంటుకున్న దృశ్యం కనిపించింది. వారు విషయం ప్రతాపరెడ్డికి తెలియజేయడంతో ఆయన కుటుంబ సభ్యులతో అక్కడి చేరుకున్నారు. పాకలో మొత్తం 14 పశులు ఉండగా 8 అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి.మరో ఆరు బర్రెలు తాళ్లు తెంచుకోని కాలిన గాయాలతో బయటపడ్డాయి. బాధిత రైతు తమకు ఎవరిపై అనుమానం లేదని ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబానికి రూ. 20 వేలు ఆర్థిక సాయం చేసి ప్రభుత్వం తరఫున నష్టపరిహారం వచ్చేలా చేస్తామని ధైర్యం చెప్పారు. పశువైద్యాధికారులు అనుషారెడ్డి, శ్రీనివాసరెడ్డి సిబ్బందితో వచ్చి గాయపడిన పశువులకు వైద్య చికిత్సలు చేసి, మృతి చెందిన పశువులకు పోస్టుమార్టం నిర్వహించారు.

క్షయవ్యాధిపై అవగాహన కల్పించాలి



వైద్యసిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్లు



రాబర్ట్ కాక్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆసియా మారూఫ్

పాములపాడు: క్షయ వ్యాధి పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్లు నాగలక్ష్మీదేవి, గులాబ్‌షా అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీతో పాటు మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు ఝాన్సీరాణి, ల్యాబ్ టెక్నీషియన్ సోమశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ గురప్ప పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు ఎర్రమఠం, గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో కలసి శుక్రవారం క్షయ వ్యాధి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు.

నందికొట్కూరు: జర్మనీ దేశస్థుడు డాక్టర్ రాబర్ట్ కాక్ టీబీ వ్యాధిని కనిపెట్టారని వైద్యులు కృష్ణమూర్తి, ఏఎస్ రాయుడు చెప్పారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వైద్యులు ప్రసాద్, షైనీ ప్రియాంక, ల్యాబ్ అసిస్టెంట్ సత్యనారాయణ, సూపర్‌వైజరు చక్రపాణి పాల్గొన్నారు.

మహానంది: క్షయవ్యాధి రహిత సమాజం కోసం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కృషి చేస్తుందని నంద్యాల జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు, జిల్లా వైద్యవిధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫరుల్లా తెలిపారు. తిమ్మాపురం పీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం ఐఎంఏ ఆధ్వర్యంలో నలభై మంది టీబీ రోగులకు రూ. 30వేల విలువైన పోషక విలువలు కలిగిన కిట్లను పంపిణీ చేశారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ బాలాజీ, ఐఎంఏ నంద్యాల జిల్లా కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్, తిమ్మాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, ఐఎంఏ మహిళా విభాగం నాయకులు డాక్టర్ నర్మద, డాక్టర్ నాగమణి, డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ శిల్పా, డాక్టర్ వసుధ, సిబ్బంది పాల్గొన్నారు. గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీహెచ్‌ఈఓ హుసేన్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ విజయలక్ష్మి, పీహెచ్‌ఎన్ రమేష్‌బాబు, కుమారి, సుధారాణిలు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

పగిడ్యాల: క్షయ వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేయరాదని మండల వ్యవసాయ అధికారి డాక్టర్ మోహన్ తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు.

ఆత్మకూరు: క్షయ వ్యాధి ఓడిపోతుందని...దేశం గెలుస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆసియా మారూఫ్‌అన్నారు. శుక్రవారం పట్టణంలోని యూనిట్ కార్యాలయంలో రాబర్ట్ కాక్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైద్యులు పవన్‌కుమార్, గోపాల్, బెంగురియస్, మహ్మద్, టీబీ సూపర్‌వైజర్లు రవి కుమార్, మస్తానయ్య, సీహెచ్‌ఓ మోహన్, సూపర్‌వైజర్లు రమణమ్మ, మాలిక్, సౌజన్య పాల్గొన్నారు.

క్షయ నివారణే లక్ష్యం

వెలుగోడు: పూర్తిస్థాయిలో క్షయ వ్యాధిని నియంత్రించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని వేల్పనూరు ప్రాథమిక పైస్థాయి ఆసుపత్రి వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారం వేల్పనూరు ఆసుపత్రిలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అవగాహన పెంచుకోవడం ద్వారా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ వ్యాధుల బారి నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. క్షయ సోకిన వారికి ప్రభుత్వం నుంచి మందులు అందిస్తూ నివారణా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వేల్పనూరు పీహెచ్‌సీ పరిధిలో వ్యాధి నయమై ఆరోగ్యంగా ఉన్న టీబీ వ్యాధిగ్రస్తులను సన్మానించారు. దత్తత తీసుకున్న రోగులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, దానమ్మ, రామాంజనేయులు పాల్గొన్నారు.

సత్తా చాటిన దర్శి ఎద్దులు

గోస్పాడు: ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన రాజశేఖర్ ఎద్దులు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో మొదటి స్థానం సాధించాయి. మండలంలోని సాంబవరం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని అంకాలమ్మ తిరునాల సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పోటీల్లో శుక్రవారం న్యూకేటగిరీ విభాగం ఎద్దుల పోటీలను డాక్టర్ జూపల్లె రాకేష్‌రెడ్డి ప్రారంభించారు. సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు రెండో స్థానం, గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన రవితేజశ్వరరెడ్డి ఎద్దులు మూడో స్థానం, బొల్లవరం గ్రామానికి చెందిన వెంకటరమణ ఎద్దులు నాల్గో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా..రూ.40వేలు, రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలను నిర్వాహకులు అందజేశారు.

ఎండ తీవ్రతపై హెచ్‌ఎంలు అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(సిటీ): ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్నందున జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఈఓ అనురాధ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో తాగునీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు తరగతి గది దాటి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పాఠశాల ల్లో మిగిలిన తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం పూట తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.